మానవ నైజాలు
శివసుందరి
Katuri

''ఈ స్టూడెంట్స్‌కి టీచింగ్ మహా పెద్ద యజ్ఞమనుకో'' అంది రాధ నిట్టూరుస్తూ.

''నీవు బాగా టీచ్ చేస్తావని ప్రక్కింటి గోపి అన్నాడే'' అంది దేవకి.

''అదే స్టూడెంట్స్‌తో వచ్చిన చిక్కు. వాళ్ళకు నచ్చితే అదే లెక్చరర్ కావాలని గోల పెడతారు, అందువల్ల స్టాఫ్ రూంలో మిగిలినవారిని ఎదుర్కోవడం చాలా కష్టం తెలుసా! నాకు తెలిసినవాళ్ళు, రిలేటివ్స్ క్లాసులో ఉండబట్టి నన్ను స్టూడెంట్స్ కోరుతారని నా కొలీగ్ శ్యామల తీర్పు'' అంది రాధ.

''ఇంతకీ ఎవరే ఆ రిలేటివ్స్ నీకు తెలియకుండా ?'' అంది దేవకి.

''నీకు తెలియకుండానేగాదే, నాక్కూడా తెలియకుండా' అను. అందుకే 'ఆడది అసూయ ద్వేషాల స్వరూపము అని తెలుసుకొనుము ఓ మూర్ఖ నరుడా' అన్నారు పెద్దలు'' అంది నాటకపక్కీలో అనూరాధ.

'అచ్చు ప్రసాద్ మామయ్యలా మాట్లాడుతున్నావే' అంది దేవకి, మామయ్య తలపుతో ఆ అమ్మాయి మొఖం వెయ్యి వాల్టుల బల్బులా వెలిగిపోయింది.

''దేవీ, చెప్పటం మరిచాను, పోయిన నెల ఢిల్లీకి ఇంటర్వ్యూకని వెళ్ళాను, అప్పుడు ప్రసాదు గెస్ట్ హవుస్‌లోనే వున్నాను, నాలుగు రోజులు'' అంది రాధ.

అనుమానంతో అప్పుడే సుడులు తిరుగుతున్న భావాన్నిబయటికి కనపడకుండా''ఎప్పుడూ టూర్‌లని అనేవాడు క్వార్టర్స్‌లో వున్నాడా'' అంది దేవకి తల్లి.

''లేకేమండీ నాలుగు రోజులు శెలవు పెట్టి ఢిల్లీ అంతా తిప్పాడు, ఇంకా వుంటే ఆగ్రా కూడా తీసుకెళ్తానన్నాడు కానీ నాకే శెలవు లేక వచ్చేశాను'' అంది రాధ.

తల్లీ కూతుళ్ళు ఉన్నట్టుండి మౌనం వహించడం చూచి అర్థము చేసుకొన్న రాధ ''దేవీ సినిమాకు వెళ్దామా విచిత్రబంధంకు'' అంది.

''నేను రాను'' అంది దేవకి నీరసంగా.

కామాక్షమ్మ లోపలికి వెళ్ళిపోయింది. ఇంక ప్రయోజనం లేదని ''నేను వెళ్ళొస్తానే'' అంటూ వెళ్ళిపోయింది.

వెళ్తున్న రాధవైపు చూస్తూ ఉండిపోయింది దేవకి. మడత చెరగని దుస్తులలో ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూవుండే రాధలో ప్రత్యేక ఆకర్షణ వుంది. ఆమె ప్రతి కదలికలో నాగరికత తెలిసినది, చదువుకొన్నది, సంస్కారవతి అని అనిపించేట్లు ఉంటుంది. అటువంటి రాధ నాలుగురోజులు మామయ్య క్వార్టర్స్‌లో ఉంది. ఆమె మాటలు, పాటలు నాలుగురోజులు చూచిన మామయ్య ఇంక తన గురించి ఆలోచిస్తాడా ? అని దేవకికి సంశయం కలిగింది. ఎందుకో తెలియనంత నీరసం వచ్చేసింది. అయినా ఒకే ఊరిలో ఉంటూ, క్లోస్ ఫ్రెండ్స్ అయిగూడా ఢిల్లీ వెళ్తున్నట్లు, మామయ్యతో గెస్ట్ హౌస్‌లో వుంటున్నట్లు చెప్పని రాధంటే దేవకికి చెప్పరాని కోపం వచ్చింది. నిస్సహాయంగా అలా కూర్చుండిపోయింది.

* * *

''ఆ చదువుల సుందరి లేదూ!'' అంది కామాక్షమ్మ.

''అదెవరు, సుందరి అంటే అందకత్తెగానీ చదువుల సుందరి ఎవరబ్బా'' అన్నాడు గోవిందరావు.

''చాల్లేండి సరసాలు, మన రాధలేదూ, పోయిన నెల ఢిల్లీ వెళ్ళిందట. ప్రసాద్‌తో నాలుగు రోజులుందట'' అంది కామాక్షమ్మ.

ఏదో భూకంపం వచ్చి పట్టణాలు మునిగి పోయాయన్నట్లు చెప్పింది.

''వెళ్తే ?'' అన్నాడు గోవిందరావు అర్థం గానట్లు.

''బాగుంది, వాడికి మన దేవకి నిద్దామని గదండీ! అయినా 'దానికి ఢిల్లీ చూపరా' అంటే 'తీరికలేదు' అన్నవాడు, ఈవిడ పోరగానే శెలవు పెట్టి ఊరంతే చూపాడట. ఇంకా ఉంటే ఆగ్రా కూడా చూపుతానన్నాడట, అయినా పెళ్ళికాని పిల్ల వాడితో తిరగటం ఏమిటీ! దీనికి బుద్ధి లేకపోతే వాడికుండ వద్దా'' అక్కసు వెళ్ళపోసింది కామాక్షమ్మ.

'అయినా ఇపుడేం కొంపలంటుకుపోయిందే, ఏదో చిన్నప్పట్నుంచీ తెలిసినవాడు, అదీగాక ఢిల్లీలో ఇంకెవరూ లేకపోవటంతో వాడి సహాయం తీసుకొనుంటుంది. అంతలో అసూయ ఎందుకు ? ఏమి ఆడబుద్ధో గదా,' అన్నాడు గోవిందరావు.

'మీ మగవాళ్ళంతా ఒకటే, ఎవరైనా నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చిన ఆడదాన్ని చూస్తే ఒళ్ళు తెలియదు మీకు. మీలాంటి వాళ్ళ బలహీనతలు పట్టుకొనే ఈ చదివిన అమ్మాయిలింత బరి తెగించారు,' అంది కామాక్షమ్మ.

'చదివినంత మాత్రాన, నలుగురితో కలిసి తిరిగినంత మాత్రాన చదివిన అమ్మాయిలంతా నీ అంత పతివ్రతలు కాకపోరే కాముడూ! అయినా చదువులో ఏం ఉంది, వారివారి బుద్ధిలో వుంది. అయినా ఏం చదువు చదివి మన పనిమనిషి మొగుడ్ని వదిలేసింది' అన్నాడు గోవిందరావు.

'అసలు మీరేం తక్కువ ? ఇల్లు దొరకలేదని నాలుగు రోజులు టైపిస్ట్‌ని మన ఇంటి గదిలో వుంచలేదా ? మీ మొగాళ్ళకు ఇంటికి వంటకు ఒక పెళ్ళాం వుండాలి. ఆ తర్వాత ఎంతమందైనా ... అసలుండండి ఆ ప్రసాదుకే రాసి ఏదో ఒకటి తేలుస్తాను' అంటూ విసవిసా లేచి వెళ్ళిన భార్యను నవ్వుతూ చూస్తుండిపోయాడు గోవిందరావ్.

* * *

ప్రశ్నలకు, సంశయాలకు జవాబుగా ఉన్నట్లుండి ఊడిపడ్డాడు ప్రసాదు. ఇంటిల్లిపాది ఆశ్చర్య ఆనందాలతో స్వాగతం చెప్పారు.

'వాడినడిగి ఏదో ఒకటి తేలుస్తాం' అంది కామాక్షమ్మ.

'మనకున్నది ఒక్కగానొక్క కూతురు, అది మోజుపడుతోందనేగానీ ఇంతకు మించిన సంబంధాలు తేగలను. అతన్నే తేలనీ' అన్నాడు గోవిందరావు.

''ఏం చేస్తున్నావు దేవీ ?'' అన్నాడు ప్రసాద్.

''పువ్వులు కడుతున్నాను'' అంది దేవకి సిగ్గుగా.

''నేనిచ్చిన బుక్స్ చదువుతున్నావా'' అడిగాడు ప్రసాదు.

''లేదు మామయ్యా, నాకు ఇంటరెస్ట్ లేదు'' అంది దేవకి.

''చూడు పోయిన నెల రాధ ఢిల్లీ వచ్చింది ఆమె ఎమ్. ఎ. పాసైంది, సైకాలజీ లెక్చరర్‌గా జాబ్ చేస్తోంది కూడా'' అన్నాడు.

''నా కెందుకు మామయ్యా జాబ్‌లు ! నేను ఒకే కూతుర్ని. రాధలాగ గంపెడు చెల్లెళ్ళు, అక్కలు, తమ్ముళ్ళూ లేరు'' అంది గర్వంగా.

''చదువు జాబ్‌కోసంగాదు దేవకి. రాధ చూడు ఎంత సోషల్‌గా వుంటుందో. నిజంగా గర్ల్ ఫ్రెండ్ అని చెప్పుకోడానికెంతో గర్వంగావుంది నా ఫ్రెండ్స్‌తో అందుకే చదువుకో అని చెప్తాను. నలుగురిలో మసలడం వస్తుంది, అని. నలుగురు మగాళ్ళని చూస్తే మొగ్గలా ముడుచుకుపోతావు ఆ రాధను చూస్తే చాలు కడుపు నిండిపోతుంది ఆ నాలుగు రోజులు పుస్తకాల గురించిగాని, సినిమాల గురించి గానీ, పాలిటిక్స్‌గానీ మా ఫ్రెండ్స్ అందరం గూడా వాదించినా ఆమెను గెలవలేకపోయాం. ఆమెను చూస్తేనే కడుపు నిండిపోతోంది'' అన్నాడు మెచ్చుకోలుగా.

''ఈ ఊర్లోనే కాలేజీలో పని చేస్తోంది. వెళ్ళి కడుపు నింపుకో'' అంటూ విసవిసా వెళ్ళిపోయింది దేవకి.

* * *

''హలో ! ఇంత అకస్మాత్తుగా ఊడిపడ్డావేం ఎలావున్నావ్'' అని పలకరించింది, అప్పుడే కాలేజీ నుండి బస్‌స్టాండు దారిపట్టిన రాధ ప్రసాదును చూడగానే.

''ఉదయమే దిగాను. పని ఎలావుంది ?'' అన్నాడు ప్రసాదు నవ్వుతూ.

''పనికేంగానీ నీ పుణ్యమా అని నాకు ఢిల్లీ ఇంటర్వ్యూలో సెలక్షన్ వచ్చింది. అంటే త్వరలో రాధగారు ఫారిన్ చెక్కేస్తారు'' అంది రాధ సంతోషంగా.

''మరి చెప్పవేం! అయితే పార్టీ ఎప్పుడు? అయినా నీవు సెలెక్ట్ కాకపోతే ఇంకెవరు సెలెక్ట్ అవుతారులే. రాధా నీతో మాట్లాడాలి పార్కుకి వస్తావా ?'' అడిగాడు ప్రసాదు.

''ఇప్పుడా ? సరే పక్కనున్న విజయా పార్కుకు పద, ఇంతకీ ఏమిటబ్బా అంత అర్జెంటుగా నాతో మాట్లాడవలసిన విషయం'' అంది సాలోచనగా రాధ.

''మా ఫ్రెండ్స్ నీకు విషెస్ చెప్పమన్నారు రాధా'' అన్నాడు.

''అదే విషయం అయితే పార్క్ వరకు ఎందుకు ?'' అంది.

''ఛఛ అదిగాదు ఒక పర్సనల్ మేటర్ చర్చించాలి'' అన్నాడు.

పార్కులో చెట్టు నీడన కూర్చున్నారు ఇద్దరు. ''నేను ఢిల్లీ వెళ్ళానని, నీ గెస్ట్‌హవుస్‌లో వున్నానని చెప్పగానే నాతో మాటలు మానేసింది నీ దేవకి'' అంది, రాధ నవ్వుతూ. కావాలనే ఆ ప్రసక్తి తెస్తూ, 'నీ' అనే పదాన్ని వత్తి చెప్తూ.

ప్రసాదు మాట్లాడలేదు. మౌనంగా రాధను చూస్తున్నాడు.

''ఇంతకీ ఎందుకు రమ్మన్నావ్ పార్క్ కి ?'' అంది రాధ చివరకు.

'ఏం లేదు రాధా! పెళ్ళి విషయం మాట్లాడుదామని' నసిగాడు ప్రసాదు.

''బాగుంది. నీ పెళ్ళి విషయం నాతో ఏం మాట్లాడుతావు ?'' ఆటలుపట్టిస్తూ అంది రాధ.

''నీవు ఒప్పుకుంటే నిన్ను పెళ్ళి చేసుకుందామని'' అన్నాడు ప్రసాదు, రాధలో మార్పును జాగ్రత్తగా గమనిస్తూ.

''వాట్ !'' ఉలిక్కిపడ్డది రాధ. ''ఏమిటీ నన్నా ? నీవా ? పెళ్ళా ? ఓ గాడ్! దేవకి నేం చేస్తావు, రుక్మిణి రోల్ ఇస్తావా ?'' అంది రాధ నవ్వుతూ. 'నీవు ఈ విషయం అడుగుతావులే అన్నట్లుంది' ఆమె ప్రవర్తన.

''రాధా ! దేవకిని చేసుకుందామనుకున్నాను. కానీ దేవికి నీకేగాదు నా వుద్యోగంలో వున్న ఏ పురుషునికీ తగిన భార్య గాదేమో'' అన్పిస్తుంది.

''అంటే నీ ఉద్యోగంలో వుండేవాడికి, భార్య కావల్సినవాళ్ళకి స్పెషల్ కొమ్ములుండాలా ? అవి నాకున్నయ్యా'' అంది రాధ మళ్లీ నవ్వుతూ.

''అదిగాదు రాధా ! దేవకి అందమైంది, కాదనను. కానీ పల్లెటూరిదానిలా ప్రవర్తిస్తుంది. ఢిల్లీలో వున్న నాకు తగదేమో అన్పిస్తుంది, అసలు నలుగురిలో మెలగలేదు, మగాళ్ళను చూస్తే మొగ్గలా ముడుచుకు పోతుంది, నాలాంటివాళ్ళ ఫాస్ట్ లైఫ్ లో ఇమడలేదేమో అనిపిస్తుంది'' అన్నాడు.

'ఎప్పట్నుండి అనిపిస్తుంది?' అంది రాధ.

'నిన్ను నాలుగు రోజులు దగ్గరగా చూసిన తర్వాత నుంచి,' తడవుకోకుండా జవాబిచ్చాడు ప్రసాదు.

పెద్దగా కిలకిల నవ్వింది రాధ.

ప్రసాదు ముఖం ఎఱ్ఱబడ్డది. 'ఎందుకంత నవ్వు' బలవంతంగా అడిగాడు.

'నీవేం తమాషా చేయటం లేదుగదా' అంది రాధ సీరియస్‌గా.

'రాధా ! చాలా సీరియస్‌గా అడుగుతున్నాను, నవ్వకుండా జవాబివ్వు' అన్నాడు ప్రసాద్.

రాధ మౌనంగా వుండిపోయింది కొంతసేపు.

''మౌనం, అంగీకారం అనుకోవచ్చా' అన్నాడు ప్రసాదు.

చివ్వున తలెత్తింది రాధ. కొంచెం బెదిరాడు ప్రసాదు.

'ప్రసాద్, నీకు దేవకికి పెళ్ళి చిన్నప్పట్నుండి అనుకొన్నది. అదీగాక నీకు దేవకికి మధ్య ఉన్న సంబంధం తెలుసు. నేను ఢిల్లీ వచ్చిన రోజు దేవకి గురించి నీవు తరచి తరచి అడగటం నాకు గుర్తే. అలాంటిది నాతో నాలుగు రోజులు తిరుగ్గానే, దేవకి కన్నా, నేనే నీకు తగినదాన్నని అనిపించటం చాలా బాధాకరమైన విషయము. నీవు నన్ను ఢిల్లీ తిప్పితే నాకు చాలా ఆనందమైంది. కానీ నాకప్పుడే నీచెల్లెలు సీత వస్తే 'మర్నాడే బండి ఎందుకు ఎక్కించావా' అని అడిగాలని అన్పించింది. కానీ, డెలికసీవల్ల అడగ లేదు. నా సబ్జెక్ట్ సైకాలజీ. నేను మొన్న ఇంటర్వ్యూకి ఢిల్లీ వచ్చింది దానిలో డాక్టరేటు స్కాలర్‌షిప్ కోసం. విదేశాలు వెళ్దామని ఆశతో.

మానవ నైజాలు

దేవుని దయవల్ల నాకు దొరికింది. నేను త్వరలో ఫారిన్ వెళ్తున్నాను. నీతో నా ప్రవర్తన సన్నిహితంగా వుండి వుంటుంది. అందుకే నీవిలా అడుగుతున్నావ్. కానీ యోచిస్తే ఇప్పుడు నీతో నాకు విషస్ పంపిన అందరితోనూ నేనదేవిధంగా ప్రవర్తించాను గదా ! వారందరినీ పెళ్ళి చేసుకోనా ? నీవిలా అడిగావనీ, నేనిలా ఉపన్యాసం ఇచ్చానని దేవితోచెప్పకు. చిన్నతనంనుండి చదువుమానేసి నిన్నేభర్తగా ఊహించుకొని స్వర్గలోకంలో విహరిస్తోంది. దానికి నా మీద అనుమానం కల్గింది. ప్రేమలో అనుమానం తప్పదు గదా ? నేనేదో తనకి అన్యాయం చేస్తానని కాబోలు, నాతో మాటలు మానేసింది. పిచ్చిపిల్ల ! అయినా ప్రసాద్ ! ఇన్నేళ్ళుగా నిర్ణయించుకొన్న వివాహాన్ని నాలుగురోజుల నా పరిచయంతో రద్దుచేసుకోదలచిన నీవు, ఇంకా అందమైన, సమర్థురాలైన అమ్మాయితో ఒక గంట పరిచయం అయితే నన్ను కూడా కాదని ఆ అమ్మాయి వెంట పడవని ఏంటి నమ్మకం ? మగవాళ్ళకు కావల్సింది స్థిరచిత్తం. పేరుకు ఆడదాన్ని చంచలచిత్తమంటారు. కానీ అసలు చంచలులు మీరే ! అదీగాక ఎప్పుడూ ఎవరికీ అన్నివిధాల తగినవారు లభించరు. దొరికిన వారినే మన కనుగుణంగా మార్చుకోవాలి. అందుకు ఆ వచ్చేవారు సహకరించాలి. దేవకి అన్ని విధాల నీకు తగింది. లెక్చర్ ఇచ్చి బోరు కొట్టానా ! ఇప్పుడు నా మీద కోపంగా వున్నా, దేవకితో పెళ్ళి జరిగిం తర్వాత అంతా మరచిపోతావు. 'ఎంత పిచ్చిగా అడిగాను రాధను' అనుకొంటావు. నాకు బస్ టైమ్ అయిపోయింది. నేను బహుశా నీ పెళ్ళికి వుండనేమో ! అడ్వాన్స్‌గా నా హృదయపూర్వక శుభాకాంక్షలనందుకో, వస్తా !'' అంటూ పరుగెత్తుతున్నట్లు వెళ్ళిపోయింది రాధ.

మాటలేని బొమ్మలా చూస్తుండిపోయాడు ప్రసాదు.

* * *

ప్రసాదు ఇంటికొచ్చేటప్పటికి దేవకి చేతిలో ఉత్తరం పెట్టుకొని ఆలోచిస్తూ వుంది.

''ఏమిటి దేవీ, దేన్ని గురించి అంతగా ఆలోచిస్తున్నావు ?'' అడిగాడు ప్రసాదు.

మౌనంగా ప్రసాదు చేతిలో వుత్తరం వుంచింది దేవకి.

ఉత్తరం విప్పాడు ప్రసాదు

''దేవీ,

నిన్న ప్రసాద్‌తో నాలుగురోజులు ఢిల్లీ తిరిగానని చెప్పగానే నాతో మాట్లాడటం మానేశావు. నీ పరిస్థితిలో వుంటే నేను అదే చేసేదాన్నేమో ! కానీ భగవంతుని దయవల్ల అలాంటి పరిస్థితిలో నేను చిక్కుకోలేదు. నీకు కొంత నిజం చెప్పాలని ఇది రాస్తున్నాను. చేదుగా వున్నా వదలకుండా జీర్ణం చేసుకో. నేను ఎమ్. ఎ. మగాళ్ళతో కలిసి చదివాను. నాకు చాలామందితో పరిచయం వుంది. నేను అబ్బాయిలతో, అమ్మాయిలతో ఎన్నోసార్లు పార్టీలు, పిక్నిక్కులకు, టూర్లకు వెళ్ళాను. ఎన్నో చర్చలు చేసాను. అందువల్ల కనబడ్డ ప్రతి మగాడ్నీ పెళ్లి చేసుకోవాలని ప్రయత్నిస్తానని అనుకోకు. అలా నీవుగానీ, అనుకుంటే అది ..పాటు దానివల్ల నష్టం నాకేం లేదు, బహుశా నీకే నష్టం సుమా ! మనశ్శాంతి పోతుంది మీ మామయ్య కూడా నాకు స్నేహితుడు. అందులో దగ్గిర దగ్గర ఇండ్లలో పెరిగాం మనం కాబట్టి చనువు నాకు. చదువు, వుద్యోగం అంటూ బయలు దేరితే మడికట్టుకొని వుంటే ఎలా ? అందుకని హద్దులు మీరినా నష్టం గూడా నాకేగదా ! ఇంతవరకు ప్రసాద్‌తో క్లోస్‌గా మాట్లాడటం తప్ప ఏ విధంగా హద్దుమీరి ప్రవర్తించలేదు నా హద్దులు నాకు తెలుసు. ఈ విషయం మీ మామయ్య ద్వారా తెలుసుకొనగలవు. అయినా చిన్నతనంనుండి 'మామయ్యే నా ప్రపంచం, అతని తలపులతో నేనేం చదువుతాను, నేనేం పాస్ అవుతాను' అనే నీవు నాలుగు రోజులు మీ మామయ్యతో మాట్లాడి, తిరగ్గానే అంత నీరసపడి, అంత అనుమానించావు నీవు నిజంగా మీ మామయ్యను ప్రేమిస్తున్నావా ? అని నా అనుమానం. బుద్ధిగా ఆతన్ని పెళ్ళి చేసుకో ఇంకా ఎంతోమంది ఆడవాళ్ళతో మీ మామయ్య మెలగాల్సి వస్తుంది. అందర్నీ పెళ్ళి చేసుకుంటూ పోతే . అర్థమైందా ? పిచ్చిగా అనుమానాలతో మనసును, ఆరోగ్యాన్ని పాడుచేసుకోకు.

నీవు, నిన్ను ప్రేమించి పెళ్ళాడే మీ మామయ్య చాలా అదృష్టవంతులు.

మీకు సుఖమైన వైవాహిక జీవితం ప్రసాదించమని ఆ దేవుని ప్రార్థిస్తూ, వుంటా.

నీ

రాధ''

ఉత్తరం పూర్తిచేసిన ప్రసాదు దేవకిని చూసాడు. దేవకి కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

'మామయ్యా నిన్నా, రాధను అనుమానించిన మాట నిజమే. అందుకు నామీద నాకే అసహ్యంగా వుంది' అంది దేవకి.

'పిచ్చిదానిలా చిన్నచిన్న విషయాలు ఎందుకంత పెద్దవి చేసుకోటం ప్రేమ ముదిరితే అనుమానంగా మారుతుంది, అందుకే త్వరలో ముడిపడితే క్షేమం' అన్నాడు దేవకి చెవిపట్టి ఆడిస్తూ.

'మామయ్యా! నీవెంత మంచివాడివి. నేను నిన్ను అనుమానించానన్నా కోపించకుండా నన్ను ఓదారుస్తున్నావు. నీలాంటి భర్త దొరకటం నా అదృష్టం' అంది పరవశంగా దేవకి.

'ఇప్పుడే గనక రాధ వుంటే 'ఆడది గాబట్టి దేవకి తప్పు ఒప్పుకుంది, మగబుద్ధి పోనిచ్చుకోకుండా ఏతప్పూ చేయనివాడిలా పోజులు కొడ్తున్నావా ?' అంటుంది' అనుకొన్నాడు ప్రసాదు మెల్లగా నవ్వుతూ.

'ఎందుకు మామయ్యా నవ్వుతున్నావు' అంది దేవకి.

'నీ అమాయకత్వానికి దేవీ! ఏ పురుషుడైనా కోరుకునేది అమాయకురాలైన భార్య, నా అదృష్టం కొద్దీ నీవు దొరికావు' అన్నాడు ప్రసాదు.

'నిజంగా రాధలాంటి అతి చురుకైన ఆడ వాళ్ళని, ఆవులిస్తే ప్రేగులు లెక్కపెట్టగలవాళ్ళని భరించడం కష్టం' గండం గడిచినట్లు నిట్టూరుస్తూ దేవకిని లోపలకు నడిపించాడు, ఎద్వాన్సుగా పాణిగ్రహణం చేసేస్తూ.